## కందుకూరులో కామన్ సర్వీస్ సెంటర్

కందుకూరు, మే 19 : జిల్లాలో కామన్ సర్వీస్ సెంటర్లతో డిజిటలైజేషన్ ప్రక్రియ సాగుతోందని తెలంగాణ రాష్ట్ర సీఎస్సీ సైట్ హెడ్ సునీల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కందుకూరులో సీఎస్సీని ఆయన ప్రారంభించారు. గ్రామీణులకు డిజిటలైజేషన్ సెంటర్లు మరిన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్యాంకింగ్ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రధాన మంత్రి ఉద్యోగ కల్పన పథకం కింద జిల్లాలో వంద మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇన్‌చార్జి బేతోజు, మేనేజర్ హరికృష్ణ, రాజేశ్వర్, లవకుశ పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

# సంస్కారవంతంగా అమ్మ పాదపూజ

- పెద్ద ఎత్తున పాల్గొన్న తల్లిదండ్రులు

ఆమనగల్లు, మే 19 : ఆమనగల్లులో అమ్మ పాదపూజ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వందేమాతరం ఫౌండేషన్, శ్రుతిలయ కల్చరల్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరంలో భాగంగా తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీపీ లలితవెంకటయ్య, శ్రుతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డిలతో కలిసి ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎడ్మ మాధవరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. చిత్తరంజన్ దాస్ బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ఎడ్మ మాధవ రెడ్డి, నర్సిరెడ్డి, రాము మాట్లాడుతూ ప్రతీ మనిషికి తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని, కన్నవారి కోసం వారు చేసే త్యాగాలు వెలకట్టలేనివన్నారు. తల్లిదండ్రుల ప్రేమకు వేరెవరూ సాటి రారన్నారు. వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిత్తరంజన్‌దాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్, ఫౌండేషన్ సభ్యులు ధనలక్ష్మమ్మ, అభినవ్‌రెడ్డి, శ్రీశైలం, శేఖర్ పాల్గొన్నారు.



## చెరువుకు గండి.. వృథాగా పోయిన నీరు

షాద్‌నగర్ రూరల్, మే 19 : గత ఏడాది కురిసిన వర్షాలకు చెరువు కట్టకు పడిన గండిని పూడ్చకపోవడంతో నీరంతా వృథాగా పోయిందని దేవునిపల్లి గ్రామస్తులు వాపోతున్నారు. నీరంతా పోవడంతో ఇప్పుడు చెరువు ఎండిందని, కనీసం పశువులకు తాగునీటి వసతి కూడా లేకుండా పోయిందంటున్నారు. అప్పడే కట్టకు మట్టి పోసి ఉంటే కొంత మేరైనా చెరువులో నీరుండేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లిలో గల మొగుళ్ల చెరువు కట్ట గతేడాది వర్షాలకు భారీ గండి పడింది. ఇప్పటి వరకు దానికి మరమ్మతులు చేయలేదు. ఇరిగేషన్ అధికారుల దృష్టికితీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్నందున ఇప్పుడైనా కట్టను పటిష్టం చేయాలని రైతులు కోరుతున్నారు.

గత ఐదారు నెలలుగా కొనసాగిన చట్ట సభల ఎన్నికల సందడి ముగియడంతో ఇక స్థానిక రాజకీయ నాయకులు, ప్రజాసేవపై ఆసక్తి ఉన్న యువత దృష్టి పంచాయతీ ఎన్నికలపై పడింది. కొన్ని నెలల క్రితమే పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం పూర్తవడంతో నూతన ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు ఎలక్షన్లు నిర్వహించాల్సి ఉంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు పూర్తవడంతో పంచాయతీలు, ఇతర స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం దృష్టి సారించాయి. మండల/జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీల పాలకవర్గాల పదవీ కాలం కూడా త్వరలోనే ముగియనుంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పోటీ చేసేందుకు రాజకీయ నాయకులు, యువత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



# స్థానికంపై ఫోకస్!

- ఎన్నికల బరిలో దిగేందుకు యువత, నాయకుల ఆసక్తి
- ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి
- సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానంపై దృష్టి
- రిజర్వేషన్ల ఖరారుపై ఆశావహుల ఎదురుచూపు
- పాత రిజర్వేషన్లే కొనసాగితే వెంటనే రంగంలోకి!

### రిజర్వేషన్ల ఖరారు కోసం ..

స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ రెండు టెర్ములకు ఒకసారి రిజర్వేషన్లు మార్చాలని అసెంబ్లీలో చట్టం చేసింది. దీని ప్రకారం ఐదేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో పాటించిన రిజర్వేషన్లనే రానున్న ఎన్నికల్లోనూ పాటించాలి. అయితే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో చట్టాన్ని తెస్తుందా? లేక పాత రిజర్వేషన్లనే అమలు చేస్తుందా? అనే తేలాల్సి ఉంది. ఎన్నికలు జరిగిన ప్రతీసారి రిజర్వేషన్ల గందరగోళం లేకుండా ఉండాలనే ఉద్దేశంతో రెండు ఎన్నికలకు ఒకసారి చొప్పున రిజర్వేషన్లు మార్చాలని బీఆర్ఎస్ ప్రభుత్వం 2019లో నూతన పంచాయతీ చట్టం చేసింది. మరి కొత్త ప్రభుత్వం ఎలా ఆలోచిస్తుందనే దానిపై రిజర్వేషన్ల కేటాయింపు ఆధారపడి ఉంది. రాజకీయ కోణంలోనూ ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. స్థానిక సంస్థల పదవుల్లో బీసీ, ఎస్టీ, ఎస్సీలకు రిజర్వేషన్ల వర్తింపు, కోటాలో ఎలాంటి తేడా లేకున్నా ఏ పంచాయతీ, ఏ వార్డు ఎవరికి కేటాయిస్తారనే అంశం పైనే అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పాత విధానాన్ని కొనసాగిస్తే ఎలాంటి సస్పెన్స్ లేకుండా పోయినసారి ఎవరికి సీటు కేటాయించారో ఆయా సామాజిక వర్గాల వారు ఇప్పటి నుంచే ఎన్నికల ప్రణాళిక రూపొందించుకునే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే స్థానిక సంస్థల్లో అన్ని వర్గాల మహిళలకు 50శాతం సీట్లు కేటాయిస్తారు.

## పంచాయతీ ఎన్నికలపై గ్రామాల్లో కొనసాగుతున్న చర్చ

చౌదరిగూడ, మే 19 : శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. చట్ట సభల ఎలక్షన్లు అయిపోవడంతో ఇక స్థానిక పాలన అందించే స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయ పార్టీలు, పోటీ చేయాలనుకునే ఔత్సాహికులు దృష్టి సారిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో తమ ప్రాబల్యాన్ని పెంచుకునేలా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి.. ఎన్నికల రంగంలోకి దూకేందుకు స్థానిక నాయకులు రెడీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో సీట్ల రిజర్వేషన్లపై చర్చ నడుస్తోంది. గత ఎన్నికల్లో అమలు చేసిన రిజర్వేషన్లనే రానున్న ఎన్నికల్లోనూ కొనసాగిస్తారా? లేక మరోసారి రిజర్వేషన్లను కొత్తగా రూపొందిస్తారా? అనే తేలాల్సి ఉంది. ఇప్పుడున్న రిజర్వేషన్లను పెంచి బీసీలకు 50శాతం ఇవ్వాలని ఆయా సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేస్తున్నాయి. రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంది. సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే ఆలస్యం 15 నుంచి 20 రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉంది.



కాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు రాజకీయ పార్టీలు రణ రంగంలోకి దూకనున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఔత్సాహికులు తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. గ్రామాల్లో మళ్లీ రాజకీయం ఊపందుకోనుంది. ఒకవైపు ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నాయకులు, యువకులు చొరవ చూపుతున్నారు. గ్రామంలో ముఖ్య నాయకులను కలుస్తూ వారి ఆశీస్సులు పొందే ప్రయత్నం చేస్తున్నారు. పంచాయతీ/మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీకి యువత ఉత్సహం చూపుతోంది. ముఖ్యంగా మొదట జరిగే సర్పంచ్ ఎన్నికలపై ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఆయా పార్టీల్లోని నాయకులు, కార్యకర్తలు, ఏ పార్టీలో సభ్యత్వం లేని వారు కూడా ఆయా పార్టీల మద్దతు కూడగట్టి పోటీచేయాలనే ఆసక్తితో ఉన్నారు. కాగా చౌదరిగూడ మండలంలో 24 పంచాయతీలు 29 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మొత్తం 25,037 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 12,796, మహిళలు 12,237, థర్డ్‌జెండర్ నలుగురు ఉన్నారు.

### రాజకీయాల వైపు యువత చూపు

ఇప్పటి వరకు రాజకీయాలంటే ఆసక్తి చూపని యువత ధోరణిలో మార్పు కనిపిస్తుంది. రోజూ ఊరిలో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కారంపై దృష్టి సారించారు. ప్రజల్లో గుర్తింపు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల్లో నిల్చుంటే ప్రజల మన్ననలు పొందేలా పనితీరును మార్చుకుంటున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ పదవులను అధిష్ఠించిన వారిలో చాలా మంది సర్పంచ్ పదవి నుంచే తమ రాజకీయ ప్రస్థానాన్ని మొదలు పెట్టడంతో స్థానిక ఎన్నికలను చాలా మంది ఓ అవకాశంగా తీసుకుంటారు. గ్రామంలో, మండలంలో పట్టు పెంచుకుంటే ఏ రాజకీయ పార్టీలో అయినా నేతగా ఎదిగే ఆస్కారం ఉండడంతో మొదట స్థానిక పదవుల్లో నెగ్గేందుకు చాలా మంది ప్రయత్నం చేస్తారు. ముఖ్యంగా సర్పంచ్ పదవిపై దృష్టి పెడతారు. రాజకీయ పార్టీ మద్దతుతో గెలవాలని చూస్తారు. ఒక వేళ ఒకేపార్టీలో ఎక్కువ మంది అభ్యర్థులు నిల్చుంటే తమ సొంత ప్రాబల్యంతో పాటు తమకు అనుకూలంగా ఉండే వారి మద్దతు తీసుకొని ఎన్నికల్లో గెల్చి ప్రజల్లో ఉన్న ఆదరణను నిరూపించుకుంటారు. ఒక రకంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు చాలా మంది రాజకీయ ప్రస్థానానికి తొలి మెట్టుగా భావించొచ్చు. రానున్న జీపీ, పరిషత్‌ల ఎన్నికలను తమ రాజకీయానికి నాందిగా చేసుకోవాలని యువత భావిస్తోంది. రాజకీయ పదవులతో ప్రజాసేవ చేయడంతో పేరు ప్రఖ్యాతులు పొందే అవకాశం ఉంది.

# గోదాంలు నిర్మించరేం?

- స్థలం ఉన్నా గోడౌన్ల ఏర్పాటుపై నిర్లక్ష్యం
- అన్నదాతల పరిస్థితిని పట్టించుకోని అధికారులు
- ఏటా కేంద్రాల వద్ద ధాన్యం తడిసి నష్టపోతున్న రైతులు

యాచారం, మే 19 : రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు వ్యవసాయ శాఖ గోదాంల నిర్మాణం చేపట్టకపోవడంతో ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో మండల కేంద్రంలో గోదాం నిర్మాణం చేస్తామని అధికారులు ప్రకటించారు. నెల రోజుల పాటు స్థల సేకరణ కోసం ఆరా తీశారు. తీరా గోదాం నిర్మాణాన్ని మాత్రం అటకెక్కించారు. యాచారంలోని వెంచర్లలో పంచాయతీకి కేటాయించిన 10శాతం స్థలంలో గోదాంలకు అనువైన స్థలమున్నా నిర్మించలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్థలం చూపకే గోదాం నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించి నిధులు వెచ్చించలేని పరిస్థితి నెలకొందని రైతులు పేర్కొంటున్నారు. గున్గల్, యాచారం, తక్కళ్లపల్లి, నందివనపర్తి గ్రామాల్లోని వెంచర్లలో గోదాంల నిర్మాణానికి స్థలం ఉన్నా కట్టించడం లేదు. ఆయా స్థలాల్లో పల్లెప్రకృతి వనాలు పెంచుతున్నారని రైతులు వాపోతున్నారు. మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ భవనం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నడుపుతున్నారు. వర్షం వస్తే ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారు. తేమ 17శాతానికి తగ్గే వరకు ఎండబోసి ధాన్యం విక్రయిస్తారు. అయితే అదే సమయంలో వర్షం వస్తే నిల్వ చేసుకునేందుకు స్థలం లేకుండాపోయింది. ఎండబోసిన చోటే కుప్ప చేసి తాటిపత్రిలు కప్పినా ఫలితం లేకుండా పోతోంది. కొనుగోలు కేంద్రం వద్ద గోదాం ఉంటే వానొచ్చే సమయంలో ధాన్యాన్ని అందులో నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పుడు అలాంటి సదుపాయం లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం కుప్పలు నానుతున్నాయి. మాల్, తమ్మలోనిగూడ, యాచారం, గున్గల్, నందివనపర్తిల్లోని వెంచర్లలో పంచాయతీకి కేటాయించిన భూమిలో గోదాంలు నిర్మిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. మండల కేంద్రం లేదా ఏదేని గ్రామాల్లో రెండు గోదాంల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



యాచారంలో ప్రైవేట్ భవన వద్ద కొనుగోలు కేంద్రం



### గోదాం నిర్మించి మమ్మల్ని ఆదుకోండి



యాచారంలో ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు గోదాం నిర్మించాలి. మేం అమ్మేందుకు తెచ్చిన ధాన్యం ఆరుబయటే పోస్తున్నాం. వర్షం వస్తే నిల్వ చేసేందుకు ఎలాంటి షెల్టర్ లేదు. ప్రతీ ఎండకాలం ధాన్యం తడుస్తోంది. ఆ వడ్లను కొనుగోలు కేంద్రంలో కూడా తీసుకోరు. గోదాం ఉంటే అందులో నిల్వ చేసుకుంటాం. యాచారంలో ఉన్న రైతు భవన్ ఆవరణలో ధాన్యం నిల్వకు షెడ్డు కట్టిస్తే బాగుంటుంది. వ్యవసాయ గోదాంల నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మహిపాల్‌రెడ్డి, రైతు, నానక్‌నగర్

### రైతులకు సరిపడా గోదాంలను ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంతో పాటు ఎక్కువ వ్యవసాయ ఉత్పత్తులు పండించే గ్రామాల్లో గోదాంలు నిర్మించాలి. యాచారం, చింతపట్ల, మాల్, గున్‌గల్ గ్రామాల్లో గల వెంచర్లలో గోదాంల నిర్మాణానికి సరిపడా స్థలం ఉంది. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలి. కలెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులు గోదాంల నిర్మాణానికి నిధులు విడుదల చెయ్యాలి.

- ఎ.నర్సింహ, సీపీఎం మండల కార్యదర్శి

# పలుచోట్ల మోస్తరు వర్షం

- వీధుల్లో పారిన వర్షపు నీరు
- పిడుగుపాటుకు రెండు కాడెడ్ల మృత్యువాత

కేశంపేట/ఇబ్రహీంపట్నం, మే 19: జిల్లాలోని పలుచోట్ల ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. చాలా ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమైంది. ఎండ తీవ్రత చాలావరకు తగ్గింది. కొన్ని రోజులుగా జిల్లాలో ఇదే వాతావరణం నెలకొంది. క్యూములోనింబస్ మేఘాలతో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. కేశంపేట మండలంలో చిన్నపాటి వర్షం కురిసింది. వీధుల్లో వర్షపు నీరు పారింది. బైర్ఖాన్‌పల్లి, అల్వాల, ఎక్లాస్‌ఖాన్‌పేట, సంగెం, కొత్తపేట, వేముల్‌నర్వ, కేశంపేట, ఇప్పలపల్లి, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, కాకునూర్, తొమ్మిదిరేకుల, లింగంధన, నిర్దవెల్లి, లేమామిడి, బొదునంపల్లి, చౌలపల్లి, చింతకుంటపల్లి గ్రామాల్లో వర్షం పడింది. వాన రాకతో వరికోతకొచ్చిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, వాతావరణం చల్లబడిందని సాధారణ ప్రజలంటున్నారు. ఇబ్రహీంపట్నం పరిధిలో మోస్తరు వర్షం కురిసింది. పగలంతా మబ్బు కమ్ముకుంది. ఎండలతో ఇబ్బంది పడుతున్న జనం కురుస్తున్న చిన్నపాటి జల్లులతో నాలుగు రోజులుగా ఉపశమనం పొందుతున్నారు.



ఎక్లాస్‌ఖాన్‌పేట వీధుల్లో పారుతున్న వాన నీరు



ఎడ్ల కళేబరాలను పరిశీలిస్తున్న రైతులు

### పిడుగుపడి రెండు ఎడ్ల మృతి

మాడ్గుల: మాడ్గుల మండలం గిరికొత్తపల్లిలో రైతు ఎండీ ఖాదర్‌కు చెందిన రెండు ఎడ్లు ఆదివారం పిడుగుపాటుకు మృత్యువాతపడ్డాయి. ఖాదర్ ఎప్పటిలాగే పొలం వద్ద చెట్టుకింద ఎడ్లను కట్టేశాడు. సాయంత్రం గాలివానకు పిడుగుపడి రెండు ఎడ్లు మృతిచెందాయి. నిర్జీవంగా పడి ఉన్న ఎడ్లను చూసి ఖాదర్ బోరున విలపించాడు. 15 రోజుల క్రితమే ఖాదర్ రూ.లక్షన్నరకు ఎద్దులను కొన్నాడని గ్రామస్తులు తెలిపారు. బాధిత రైతును ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు.

## మైసిగండి మైసమ్మ ఆలయం వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రం

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

కడ్తాల్, మే 19 : మండల పరిధి మైసిగండి మైసమ్మ ఆలయం వద్ద ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఆలయం వద్ద ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రతి ఆది, మంగళ, గురు వారాల్లో మైసమ్మ ఆలయానికి వందలాదిగా భక్తులు వస్తుంటారు. జాతీయ రహదారి నుంచి ఆలయంలో హైదరాబాద్, కల్వకుర్తిల వైపు నుంచి భక్తుల వాహనాలు మళ్లే క్రమంలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. నియంత్రణ చేయక వందలాది వాహనాలు ఆలయం వద్ద హైవేపై నిలిచిపోతున్నాయి. తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆలయంలోకి మళ్లే ప్రధాన ద్వారం సమీపంలోనే బస్టాప్ ఉంది. అక్కడే ప్రయాణికుల కోసం వాహనాలు నిలుపుతున్నారు. దీంతో వారంలో మూడు రోజులు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. పేరుగాంచిన మైసిగండి ఆలయం వద్ద భక్తుల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆలయం వద్ద రద్దీ ఉండే రోజుల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించి ఇబ్బందులు లేకుండా చూడాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.



మైసమ్మ ఆలయం వద్ద రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

## బాధిత రైతు కుటుంబాలకు త్వరలో ఆర్థిక సాయం : ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

● ప్రతిపాదనలను పంపించాలని ఆర్డీవోకు సూచన



తాండూరు, మే 19: పిడుగుపాటుతో మృతిచెందిన రైతు కుటుంబాలను ఆదుకుంటామని, తక్షణమే ప్రభుత్వం నుంచి రూ.6లక్షల ఆర్థికసాయం అందేలా చూస్తామని, ఆర్డీవోకు సూచించామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. యాలాల మండలంలో జరిగిన ఈ ఘటనలో మృతిచెందిన బెన్నూరుకు చెందిన ఎంకప్ప, జుంటుపల్లికి చెందిన మంగలి శ్రీనివాస్, లక్ష్మప్ప మృతిపట్ల ఆయన దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా అందాల్సిన రూ.6లక్షల ఆర్థిక సాయాన్ని వెంటనే మృతుల కుటుంబాలకు అందేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఎమ్మెల్యే ఆర్డీవోకు సూచించారు.



# భారంగా రైతువేదికల నిర్వహణ

● రెండేళ్లుగా నిధులు లేక అస్తవ్యస్తం

● విద్యుత్ బిల్లులు చెల్లించలేని వైనం



కులకచర్లలోని రైతువేదిక వద్ద ధాన్యం నిల్వచేస్తున్న రైతులు(ఫైల్)

కులకచర్ల: మే 19 : రైతుల ప్రయోజనాల కోసం నిర్మించిన రైతు వేదికల లక్ష్యం గాడి తప్పుతోంది. ప్రభుత్వం నుంచి రెండేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో నిర్వాహణ అస్తవ్యస్తంగా మారింది. విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు. ఒక్కో రైతువేదిక రూ.10వేలకుపైగా విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇతర పనులు సొంత డబ్బులతో చేయాల్సి వస్తుండటంతో వ్యవసాయ విస్తరణ అధికారులకు తలకు మించిన భారంగా మారింది. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించడం, పంటల సాగులో అవసరమయ్యే సలహాలు, సూచనలు ఇచ్చేందుకు 2021లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో క్లస్టర్‌ల వారీగా కులకచర్ల, ముజాహిద్‌పూర్, కుసుమ సముద్రం, చౌడాపూర్, మరికల్, కల్మన్‌కాల్వ గ్రామాల్లో రైతు వేదికలు నిర్మించారు. ఒక్కో రైతు వేదికను రూ.22లక్షలతో నిర్మించారు. ఒక్కోవేదికకు ఏఈవోను నియమించారు. రైతు వేదికల్లో పారిశుధ్యం తదితర పనులకు సహాయకుడిని ప్రభుత్వం నియమించకపోవడంతో విలువైన సామగ్రి దొంగల పాలవుతోంది. ఏఈవోలే తమ సొంతఖర్చుతో వాచ్‌మన్‌లను ఏర్పాటు చేశారు.

### నిర్వహణ గాలికి..

రైతువేదికల నిర్వహణకు నెలల తరబడి నిధులు మంజూరు కాకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో వ్యవసాయశాఖ విస్తరణ అధికారులే సొంతడబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగింపు దశలోనైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఆశించినప్పటికీ ఎలాంటి స్పందనాలేదు. రైతు వేదికల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం లాంటి నిర్వహణ ఖర్చుల నిమిత్తం ప్రతీనెల రూ.3వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ రెండేళ్లుగా నిధులు విడుదల చేయకపోవడంతో పలు ప్రాంతాల్లో సంబంధిత అధికారులు కొందరు వారి వేతనం నుంచి ఖర్చు చేస్తున్నారు. 2022



కులకచర్లలోని రైతు వేదిక

ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఒక్కో రైతువేదికకు రూ.45వేలు అందించింది. ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. స్టేషనరీ, జిరాక్స్‌లకు రూ.1000, శిక్షణ కార్యక్రమాలకు రూ.2500, తాగునీటి కోసం రూ.5వేలు, పరిశుభ్రత, వాచ్‌మెన్‌ల కోసం రూ.3వేలు ప్రతీనెలా ఖర్చు అవుతున్నాయి. కరెంట్ బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని హెచ్చరిస్తున్నారని తెలిపారు.

### మెయింటెనెన్స్ చేపట్టాలి

మర్పల్లి: మండలంలో 5 క్లస్టర్ల పరిధిలోని మర్పల్లి, బిల్కల్, సిరిపూరం, పట్లూర్, కల్కొడ గ్రామాల్లో ఉపాధిహామీ నిధులు రూ.20లక్షలకుపైగా ఖర్చు చేసి నిర్మించారు. అన్ని గ్రామాల్లో రైతువేదికలు గ్రామానికి దూరంగా ఉన్నాయి. వీటిని రైతులు, వ్యవసాయ అధికారుల సమావేశానికి ఉపయోగించాల్సి ఉండగా, అక్కడ సమావేశాలు నిర్వహించకపోవడంతో రైతు వేదికలు నిరుపయోగంగా మారాయి. లక్షలాది రూపాయలతో నిర్మించిన రైతువేదికల్లో నిర్వాహణ చేపడితే బాగుంటుందని రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ సమావేశాలు, ఫంక్షన్‌లు జరుపుకునేందుకు అనుకూలంగా ఉన్నాయి. అద్దెకు ఇస్తే వచ్చిన ఆదాయంతో రైతు వేదికల నిర్వాహణ జరిగేందుకు అవకాశం ఉంటుంది. సమావేశాలు, ఫంక్షన్‌లకు అద్దెకిస్తే పలు అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశం ఉంటుందని పలువురు రైతులు తెలిపారు.

### త్వరలో నిధులు

ప్రభుత్వం నుంచి త్వరలోనే నిధులు వచ్చే అవకాశం ఉంది. రైతు వేదికల నిర్వాహణకు సంబంధించి నిధుల కోసం ప్రతీనెల ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నాం. త్వరలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కాగా, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వంలో నిధులు విడుదలై సమస్య పరిష్కారమవుతుంది.

- వీరస్వామి, ఏవో, కులకచర్ల

# సైబర్ నేరాలకు గురైతే 1930కు ఫిర్యాదు చేయండి

● తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు, మే 19: సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తాండూరు డిఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని బాలాజీ మందిర్‌లో ఆదివారం మర్వాడి యువమంచ్, పోలీస్ శాఖలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. మొబైల్ ఫోన్‌లలో యాక్‌ఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మోసపోకుండా ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే ఆఫర్లకు ఎవరు అత్యాశ పడవద్దని ఆయన సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని చేడుగా వినియోగించే కేటుగాళ్లు ఈ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మర్వాడీ యువమంచ్ అధ్యక్షుడు అనిల్ సార్దా, కార్యదర్శి సచిన్, కోశాధికారి అరుణ్, జాతీయ సభ్యుడు మన్మోహన్ సార్దా, సన్నీఅగర్వాల్, దీనేష్ పర్థాని, మాజీ అధ్యక్షుడు మోహన్ సార్దా ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



# దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న యాట నర్సింహ

కడ్తాల్, మే 19: మానవాళి సన్మార్గ పురోగమనానికి, సమాజ శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు ఎంతగానో దోహపడుతాయని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగేవారు ఒత్తిళ్లను అధిగమించి ఆనందమయ జీవితాన్ని పొందుతారని అన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ పోచమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్లమోని సత్యంయాదవ్‌సుజాతల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు మాలే మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్, రాములు, పాండు, యాదయ్య, శేఖర్‌రెడ్డి, రవి, తదితరులు ఉన్నారు.

## వైద్య శిబిరం విజయవంతం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మే 19 : పట్టణ సమీపంలోని యెన్నం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ యెన్నం హరికాంత్ రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జడ్పీ వైస్ చైర్మన్ బలాజీసింగ్‌లతో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అంబులెన్స్‌ను ప్రారంభించారు. భృంగి ఆనంద్, అంజన్‌రెడ్డి, భూపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, పర్వత్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

కందుకూరు, మే 19 : విశ్వ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీశైలం అన్నారు. ఆదివారం మండలంలోని మేడిపల్లి గ్రామంలో విశ్వబ్రాహ్మణుల సంఘ భవన నిర్మాణం కోసం రూ.20వేల నగదు అందించారు. ఆయనతో పలువురు సీపీఎం నాయకులు తదితరులు ఉన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీశైలం



## రుతుపవనాలు వచ్చాయా అన్నట్లు..!

మూడు నెలలుగా ఎండల తీవ్రతతో ఇబ్బంది పడ్డ ప్రజలు ఒక్కసారిగా వర్షాలు కురువడంతో వాతావరణం చల్లబడి ఆహ్లాదాన్ని పొందుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆకాశంలో నల్లటి మబ్బులు కనిపించడడంతో జూన్ మొదటి వారంలో వచ్చే రుతు పవనాలు ఇప్పుడే వచ్చాయా? అని చర్చించుకుంటున్నారు. ఆదివారం తాండూరు ప్రాంతంలో అరగంటపాటు ఈదురుగాలులు, ఉరుములతో కూడినవర్షం కురిసింది. ఉక్కపోత లేకపోవడంతో చల్లబడిన వాతావరణంలో తాండూరు పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

తాండూరు, మే 19

## ఘనంగా మల్లన్న స్వామి బోనాలు



ఇబ్రహీంపల్లిలో బోనాల ఊరేగింపు

చేవెళ్ల, మే 19 : మండల పరిధిలోని ఇబ్రహీంపల్లి గ్రామంలో మల్లన్న స్వామి బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి మల్లన్న స్వామికి నైవేద్యం సమర్పించారు. గ్రామంలోని మహిళలు బోనాలతో తరలగా.. పోతురాజుల విన్యాసం, శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లతో గ్రామంలో సందడి నెలకొంది. ఒగ్గుకళాకారులు స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న స్వామికి గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండేలా దీవించాలని భక్తులు స్వామిని వారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, సీనియర్ నాయకుడు బండారు వెంకట్‌రెడ్డిలను గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పైండ్ల మధుసూదన్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, సత్యనారాయణగౌడ్, అంజయ్య యాదవ్, జగన్ గౌడ్‌లు ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు, మహిళలు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## బెల్టు షాపులు ఎత్తేయాలని పిల్లలతో కలిసి నిరసన



చిన్నారులతో కలిసి నిరసన చేస్తున్న నవీన్

షాద్‌నగర్ రూరల్, మే 19 : తమ గ్రామంలో బెల్ట్‌షాపులు ఎత్తేయాలని గ్రామ యువకుడు వినూత్న రీతిలో నిరసన చేపట్టాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం కందివనం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కొన్నాళ్లుగా తమ గ్రామంలో విచ్చలవిడిగా విక్రయిస్తున్న మద్యం వల్ల యువకులు మద్యానికి బానిసై జీవితాలను పాడుచేసుకుంటున్నారని నవీన్ అనే డిగ్రీ విద్యార్థి, కొందరు పిల్లలతో కలిసి గ్రామంలో ప్లకార్డులు పట్టుకొని నిరసనకు దిగాడు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే.. తాను నిరసనకు దిగానని నవీన్ తెలిపాడు. ముందే పేదరికంలో ఉన్న కుటుంబాలు మద్యంతో మరింత పేదలుగా తయారువుతున్నాయని, కూలి డబ్బులను మద్యానికే వెచ్చిస్తున్నారని అతడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇకపై గ్రామంలో మద్యం అమ్మకుండా చూడాలని కోరాడు. కాగా, యువకుడు చేపట్టిన నిరసనకు మహిళల నుంచి మంచి స్పందన వచ్చింది.



తైక్వాండో విద్యార్థులతో హన్మంత్‌రావు

## మహిళల ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం

- జిల్లా క్రీడల అధికారి హన్మంతరావు

దోమ, మే 19: మహిళల ఆత్మరక్షణకు తైక్వాండో ఎంతగానో దోహదపడుతుందని వికారాబాద్ జిల్లా క్రీడల అధికారి కె.హన్మంత్ రావు అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న తైక్వాండో వేసవి శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో జరుగుతున్న ఈ కరాటే శిబిరాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. మహిళల దృఢత్వానికి, ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ఇలాంటి వాటిలో భాగస్వాములు కావడంతో ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇటుక బట్టీలకు నల్లమట్టి

- చెరువు నుంచి గుట్టుగా తరలిస్తున్న వైనం

మాడ్గుల, మే 19 : మండలంలోని ఇర్విన్‌చెర్వు నుంచి కొందరు అక్రమంగా నల్లమట్టిని ట్రాక్టర్ల ద్వారా రెడ్డిపురం సమీపాన పంట పొలంలో డంపింగ్‌చేసి రాత్రివేళ టిప్పర్ల ద్వారా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని ఇర్విన్ ప్రజలు ఆరోపిస్తున్నారు. చాలా రోజులుగా చెరువుల నుంచి నల్లమట్టిని తరలిస్తున్నారని రైతులు తెలిపారు. సంబంధిత అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, పోలీసులు మట్టిని తరలిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఇర్విన్ గ్రామ ప్రజలు కోరుతున్నారు.



పొలంలో డంప్ చేసిన నల్లమట్టి

# రోడ్లపైనే కూరగాయల విక్రయం

- విక్రయదారులు, ప్రజలకు తప్పని తిప్పలు
- ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు ఇబ్బంది
- ప్రత్యేక స్థలం కేటాయించాలని విన్నపం

కొందుర్గు, మే, 18 : రోడ్లపైనే కూరగాయల సంతలు నిర్వహిస్తుండడంతో.. సంతకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా మార్కెట్ లేకపోవడంతో ప్రజలు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. 1985లో కొందుర్గును నూతన మండలంగా ఏర్పాటు చేశారు. 1987లో కొందుర్గులో సంతను ఏర్పాటు చేశారు. కొన్ని సంవత్సరాల తరువాత సంతను బంద్ చేశారు. ఆ తరువాత 2019 నుంచి కొందుర్గు మండల కేంద్రంలో కూరగాయల సంతను ప్రారంభించారు. గ్రామంలో సంత ఏర్పాటు కోసం ప్రభుత్వ స్థలం లేకపోవడంతో మెయిన్‌రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లే దారిలోనే రోడ్డు పైనే కూరగాయల సంత నిర్వహిస్తున్నారు. దాంతో మండల కేంద్రంలోని రైతులతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన రాంచంద్రాపూర్, గంగన్నగూడ, శ్రీరంగాపూర్, చిన్నఎల్కిచర్ల, ఉమ్మెంత్యాల, లాలాపేట్‌లో పండించే కూరగాయలు కొందుర్గు మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం నిర్వహించే సంతకు తరలిస్తుంటారు. కాగా, ప్రజలకు ఇక్కడ తాజా కూరగాయలు తక్కువ ధరకే దొరుకుతున్నాయి. గ్రామంలోకి వెళ్లే రోడ్డుకిరువైపులా కూరగాయలు వ్యాపారులు కూర్చుంటుండడంతో రోడ్డు కాస్తా ఇరుకుగా మారుతోంది. ఈ దారి వెంటనే ముదిరాజ్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, బీసీ కాలనీవాసులు వెళుతుంటారు. రోడ్డుపైనే సంత కొనసాగుతుండడంతో కూరగాయలకు వచ్చేవారు, కాలనీలకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు చివరి వరకు వెళ్లి కూరగాయలు కొనుక్కొని వెనక్కి రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. కూరగాయలను మండల కేంద్రం నుంచి ఉన్న షాద్‌నగర్-పరిగి బీటీ రోడ్డు వరకు అమ్మకానికి పెడుతుండడంతో కొనుగోలుదారులు, వాహనదారుల కారణంగా ప్రతీ ఆదివారం ట్రాఫిక్ జామ్ అవుతోంది. అదేవిధంగా మండల పరిధిలోని రాంచంద్రాపూర్‌లో ప్రతీ బుధవారం నిర్వహిస్తున్న సంత కూడా రోడ్డు పైనే నిర్వహిస్తుండడంతో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సంతకు రాంచంద్రాపూర్ గ్రామస్థులతో పాటు పులుసుమామిడి, పర్వతాపూర్ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉండడంతో రాంచంద్రాపూర్ సంతకు మండల కేంద్రమైన కొందుర్గు, అటు మహాదేవ్‌పూర్, భైరంపల్లి, ఉత్తరాస్‌పల్లి, టేకులపల్లి, ముట్పూర్, రేగడి చిల్కమర్రి, ఇటు శ్రీరంగాపూర్, చిన్నఎల్కిచర్ల, అయోధ్యాపూర్‌తండా వాసులతో పాటు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద, ఎలికట్ట, షాద్‌నగర్ పట్టణ మహిళలు కూరగాయల సంతకు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. దీంతో ప్రతీ బుధవారం రాంచంద్రాపూర్ సంతలో విపరీతమైన జనాల రద్దీ ఉంటుంది. కొనుగోలుదారులు రాంచంద్రాపూర్ నుంచి పులుసుమామిడి వరకు వెళ్లి కూరగాయలను కొంటారు. తిరిగి రాంచంద్రాపూర్ చౌరస్తాకు రావాలంటే అర కిలోమీటర్ దూరం ఉంటుంది. అధికారులు స్పందించి.. అందరికీ అందుబాటులో ఉండేలా సంతలకు ప్రత్యేక స్థలాలను కొందుర్గు, రాంచంద్రాపూర్ గ్రామాల్లో ఏర్పాటుచేయాలని మండలవాసులు కోరుతున్నారు.



షాద్‌నగర్-పరిగి బీటీ రోడ్డుకిరువైపులా కొనసాగుతున్న కూరగాయలు విక్రయం(ఫైల్)



రాంచంద్రాపూర్ సంతలో రోడ్డుకిరువైపులా విక్రయాలు

### సంతను అతథిగృహం స్థలంలోకి మార్చాలి

కొందుర్గు మండల కేంద్రంలో వృథాగా ఉన్న ఆర్ అండ్‌బీ అతిథి గృహం స్థలంలోకి కూరగాయల సంతను మార్చాలని మండల వాసులు కోరుతున్నారు. దీనివల్ల రోడ్డుపై రాకపోకలకు ఇబ్బంది తొలగిపోతుందని, దాంతోపాటు ఆర్అండ్‌బీ స్థలం అన్యాక్రాంతం కాకుండా ఉంటుందని చెబుతున్నారు. పంచాయతీ, మండల అధికారులు రోడ్లు భవనాల శాఖ అధికారులతో మాట్లాడి.. సంతను ఆర్అండ్ బీ అతిథి గృహంలోకి మార్చాలి.

### వేరే చోట స్థలం కేటాయించాలి



కూరగాయల సంత రోడ్డుపై నిర్వహిస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామంలోని ప్రధాన రహదారి కావడంతో ప్రతీ ఆదివారం స్థానికులు, వాహనదారుల రాకపోకలు సాగించడం కష్టంగా ఉంది. వేరేచోట స్థలం కేటాయించి కూరగాయల సంతను అక్కడికి మార్చాలి.

- పెద్ది శ్రీనివాస్, కొందుర్గు

### తైబజార్ ఏర్పాటు చేస్తాం



కొందుర్గు సంతలో గతంలో తక్కువ కూరగాయల దుకాణాలు ఉండేవి. ప్రస్తుతం ప్రతీ వారం కూరగాయల విక్రయించేవారు పెరగడంతో దుకాణాల సంఖ్య కూడా పెరుగుతోంది. ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని త్వరలోనే తైబజార్‌ను ఏర్పాటు చేస్తాం. దీనివల్ల సంతను అనువైన స్థలానికి తరలించే అవకాశం ఉంటుంది.

- లాలయ్య, ఎంపీవో, కొందుర్గు

# వీడని గ్రహణం

- అసంపూర్తిగా వంతెన నిర్మాణం
- మూడేళ్లయినా పూర్తికాని పనులు
- మేడిగడ్డ-శంకర్‌కొండ వాగుపై రాకపోకలకు ఇబ్బందులు

ఆమనగల్లు, మే 19 : మండల పరిధిలోని మేడిగడ్డ-శంకర్ కొండ రోడ్డులో కత్వ వాగుపై వంతెన నిర్మాణానికి గ్రహణం వీడడం లేదు. దాంతో గిరిజనులకు దశాబ్దాలుగా బాధలు తొలగడం లేదు. ప్రతీయేటా వర్షాకాలంలో వాగు పారుతుండటంతో మేడిగడ్డ-శంకర్‌కొండ తండాల మధ్య రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ ఏడాదైనా బాధలు తొలుగుతాయని భావించినా తీరా నిరాశే ఎదురైంది. వాగుపై వంతెన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. అసంపూర్తి పనుల పూర్తి విషయంలో ఎవరూ చొరవ తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. వాగుపై వంతెన లేక రాకపోకలకు ఆయా తండాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన లేని కారణంగా బస్సులు కూడా నడవక గిరిజనులు అత్యవసర పరిస్థితుల్లో వేదనకు లోనవుతున్నారు. వంతెన నిర్మించాలని దశాబ్దాల కాలంగా గిరిజనులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద వంతెన నిర్మాణానికి రూ.3.10 కోట్లు మంజూరు చేసింది. నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా పనులు చేపట్టకపోవడంతో గిరిజనులు మేడిగడ్డ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చారు. 2022 సెప్టెంబరు 6న వంతెన నిర్మాణ పనులను అప్పటి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. కొన్ని నెలల తర్వాత వంతెన నిర్మాణానికి గోతుల వరకు పనులు చేసి నీరు వచ్చిందన్న సాకుతో వదిలేశారు. ఇక ఏడాది కావోస్తున్నా తిరిగి పనులు ప్రారంభించలేదు. 2023 జూన్ 11న కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే వంతెన నిర్మించాల్సిన ప్రదేశాన్ని సందర్శించి పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. పనుల నిర్వాహణ తీరుపట్ల తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత మూడు నెలలకు పనులు ప్రారంభించారు. పిల్లర్ల వరకు నిర్మాణం చేపట్టారు. పనులకు నిధులు విడుదల కాక కాంట్రాక్టర్ పనులు అసంపూర్తిగా నిలిపివేశాడు. మూడు నెలల కాలంగా పనులు నిలిచిపోయాయి. మంజూరైన నిధులు విడుదల కాక, పనులు ముందుకు సాగకపోవడంతో వాగు సమీప తండాల గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో 20 రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుంది. అయినప్పటికీ పనుల విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు చొరవ తీసుకొని నిలిచిపోయిన పనులు ప్రారంభించి వంతెన నిర్మాణం పూర్తి చేయించి వినియోగంలోకి తేవాలని గిరిజనులు కోరుతున్నారు.



అసంపూర్తిగా నిలిచిన వంతెన నిర్మాణం

### వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం



వంతెన నిర్మాణ పనులు వారం రోజుల్లో ప్రారంభిస్తాం. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రెండు నెలలుగా పనులు నిలిచిపోయాయి. ఇటీవలే పనుల పూర్తి గురించి కాంట్రాక్టర్‌కు తెలియజేశాం. ఇప్పటికే పిల్లర్ల నిర్మాణం పూర్తైన నేపథ్యంలో స్లాబ్ నిర్మించి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయిస్తాం. వర్షాకాలం వరకు అన్ని పనులు పూర్తి చేయిస్తాం. వాగు వద్ద రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

- కృష్ణయ్య, ఏఈ, ఆమనగల్లు

### పనులు వెంటనే పూర్తి చేయాలి



మేడిగడ్డ-శంకర్ కొండ వాగుపై వంతెన నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. అసంపూర్తి పనుల పూర్తి విషయంలో ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వర్షాకాలం ప్రారంభమైతే రెండు తండాల మధ్య వాగు సాగి రాకపోకలు నిలిచిపోతాయి. నిధులు విడుదల చేసి పనులు చేపట్టి వాగు వద్ద రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. ప్రభుత్వం ఈ విషయంలో దృష్టి సారించాలి.

- ప్రశాంత్ నాయక్, శంకర్‌కొండ

### ఏళ్లగా తప్పని బాధలు



వాగుపై వంతెన లేక ఏళ్ల కాలంగా గోస తీస్తున్నాం. వంతెన లేని కారణంగా సరైన రవాణా సౌకర్యం లేక అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు వస్తే తమ బాధలు చెప్పనలవి కావు. మేడిగడ్డ-శంకర్ కొండ వాగుపై అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు వెంటనే ప్రారంభించాలి. బ్రిడ్జి నిర్మాణం పూర్తైతే మాడ్గుల, వెల్దండ, ఆమనగల్లు మండలాల పరిధిలోని అనేక గ్రామాలకు వెళ్లే వారికి కూడా సౌకర్యంగా ఉంటుంది.

- శాంతి, సామాయిపల్లి తండా

# మున్సిపాలిటీ అభివృద్ధికి 'రూ.30 కోట్ల' హామీ

- పెండింగ్‌లకు మోక్షం లభించేనా?
- ఆరు నెలలుగా ఎమ్మెల్సీ.. ఎంపీ ఎన్నికల హడావుడితోనే సరి
- ఎమ్మెల్యేగారు.. ఇక దృష్టి సారించాలి మీరు

షాద్‌నగర్, మే 19 : ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణ మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నాయకులు హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి రాగానే వాటిని అమలు చేసి తీరుతామని వాగ్దానాలు ఇచ్చారు. ఆ వెనువెంటనే మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నిక.. అది ముగియగానే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో పనులు పెద్దగా ముందుకు సాగలేదు. ప్రధానంగా అభివృద్ధికి ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడంతో ఎలాంటి కొత్త పనులు చేపట్టే అవకాశం లేకుండాపోయింది. అయితే, ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే వీర్లపల్లి శంకర్ గత ప్రభుత్వంలో చేపట్టి, నిలిచిపోయిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న షాద్‌నగర్ పట్టణ చౌరస్తా నుంచి సోలీపూర్ బైపాస్ వరకు ఉన్న పాత జాతీయ రహదారి పనులను పూర్తి చేసేందుకు రూ.60 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. మిగతా పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



పెండింగ్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జి

### పెండింగ్ పనులు ఇలా

ఎన్నికల ముందు ఎమ్మెల్యే ఇచ్చిన హామీలలో ప్రధానంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఉంది. దీని నిర్మాణం కోసం ఇప్పటివరకు స్థల సేకరణ కూడా జరగలేదు. దీనిపై దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు. షాద్‌నగర్ పట్టణంలో మోడల్ మార్కెట్, మినీ స్టేడియం నిర్మాణం, 100 పడకల ఆస్పత్రి, కాలనీలలో అంతర్గత రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు, గ్రామీణ ప్రాంతాలకు రహదారులు, ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, కొత్త లబ్ధిదారుల ఎంపిక లాంటి వాటిపైన దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అలాగే మండల కేంద్రాల్లో మార్కెట్ షెడ్‌ల నిర్మాణాలు, చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణం, పట్టణంలో మౌలికవసతులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

### లోక్‌సభ ఎన్నికలకు ముందే పరిశీలన

షాద్‌నగర్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను లోక్‌సభ ఎన్నికలకు ముందే పరిశీలించారు. ఈమేరకు ఆయా శాఖాధిపతులతో సమావేశాలు నిర్వహించారు. పనులను పూర్తి చేయడానికి అవసరమైన నిధుల గురించి కూడా అధికారులతో వివరాలు సేకరించారు.



కేటాయించని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

గత ప్రభుత్వం ప్రారంభించిన పనులకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడం వల్లనే పనులు నిలిచిపోయాయని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. నిధులు విడుదల చేస్తే వెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని సంబంధిత శాఖ అధికారులు సూచించారు. దీంతో ఆయన పనుల పూర్తి కోసం సంబంధిత శాఖ మంత్రులను కలిసి నివేదికలు కూడా అందజేశారు.



నత్తనడకన సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణ పనులు

### రూ.30 కోట్ల మంజూరుకు సీఎం హామీ

ఇటీవల లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా షాద్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో నిర్వహించిన రోడ్ షోలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్‌లో నెలకొన్న సమస్యలపై ఏకరువు పెట్టారు. వీటి పరిష్కారానికి రూ.50 కోట్లు మంజూరు చేయాలని సీఎంను కోరారు. దీనికి సీఎం స్పందిస్తూ రూ.30కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నిధులతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయాలని తెలిపారు.

### త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతాం



గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులులేక నిలిచిపోయాయి. వాటన్నింటినీ వెంటవెంటనే పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాం. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పనులు పూర్తి చేయలని, అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నాం. షాద్‌నగర్ మున్సిపాలిటీకి నిధులు మంజూరు కాగానే.. పట్టణంలో విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్య ఇస్తాం. ఇతర అభివృద్ధి పనులను కూడా చేపడతాం.

- వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్


నగదు అందజేస్తున్న మద్దూరి అశోక్‌గౌడ్

## అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

షాద్‌నగర్, మే 19: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని, ఊరూరా ఆయన విగ్రహాలను ఏర్పాటు చేయడంతో పాటు అంబేడ్కర్ ఆలోచనలను ఆచరణలో పెట్టాలని మద్దూరి ఫౌండేషన్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మద్దూరి అశోక్ గౌడ్ సూచించారు. కొందుర్గు మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కోసం రూ.పదివేల విరాళం కమిటీ సభ్యులకు షాద్‌నగర్‌లో అందించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని ఈ సందర్భంగా కొనియాడారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆమనగల్లు, మే 19: ఆమనగల్లు పట్టణంలో నేడు(సోమవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ సీతారాములు తెలిపారు. 33 కేవీ, 11కేవీ లైన్‌లో చెట్లను తొలగించేందుకు ఆమనగల్లు పట్టణంతో పాటు ఆ ఫీడర్ పైన ఉన్న ఇండస్ట్రీస్‌కు ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రజలు, విద్యుత్ వినియోగదారులు, వ్యాపారులు, పరిశ్రమల నిర్వాహకులు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలని ఏఈ కోరారు.

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



కొందుర్గు, మే, 19: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాడిగళ్ల సామ్యూల్ (68) ఆదివారం మృతి చెందడంతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన నాయకులు మాజీ ఎంపీటీసీ సభ్యులు కావలి యాదయ్య, సీనియర్ నాయకులు కె.రాములుగౌడ్ మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎ.కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, బోరిగే యాదయ్య, బి.పాపయ్య, బి.నర్సింహులు, బి.రవి, జె.ప్రవీణ్, బి.రమేష్, సి.అశోక్, శ్రీను, ఎం.సాయిలు తదితరులు ఉన్నారు.

# సుందరయ్య ఆశయాలను కొనసాగించాలి

- సీపీఎం నాయకులు
- పుచ్చలపల్లి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళి

షాద్‌నగర్, మే 19 : తెలంగాణ సాయుధ పోరాట సారథి, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగించాలని సీపీఎం నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులు ఎన్.రాజు మాట్లాడుతూ దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సుందరయ్య అని కొనియాడారు. పేదలకు భుక్తి, భూమి కోసం నిరంతరం శ్రమించారని, ఆయన ఆశయాల కోసం పార్టీ నేతలు మరింత శ్రమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీను నాయక్, ఈశ్వర్ నాయక్, బిజిలి సత్యం, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం** : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఇబ్రహీంపట్నంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సారథ్యం వహించి దొరలు, భూస్వాముల ఆగడాలకు ఎదురొడ్డి పోరాడిన ఆయన్ను ప్రజలు ఏనాడూ మరువరని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.సామేల్, మండల కార్యదర్శి సీ.హెచ్. జంగయ్య, మున్సిపల్ కార్యదర్శి చింతపట్ల ఎల్లేష్, నాయకులు గణేష్, నర్సింహ, .జగన్, బుగ్గరాములు, లింగస్వామి, వెంకటేష్, మునలయ్య, విఘ్నేష్, యాదగిరి, సత్తన్న తదితరలున్నారు.

**మొయినాబాద్ రూరల్** : గొప్ప కమ్యూనిస్టు నాయకుడు, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధన కోసం ఎర్ర జెండా నిరంతరం పేద ప్రజల తరపున పోరాటం చేస్తుందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామంలో సీఐటీయూ, భవన నిర్మాణ సంఘం కార్మికల ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. దేవేందర్ హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సుందరయ్య తన జీవితాన్ని మొత్తం పేద ప్రజల కోసం త్యాగం చేసిన గొప్ప యోధుడన్నారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేసి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా పనిచేసే సమయంలో సైకిల్‌పై పార్లమెంటుకు వెళ్లిన గొప్ప నాయకుడన్నారు. బీజేపీ ఓబీసీ మండలాధ్యక్షుడు అశోక్‌యాదవ్, భవన నిర్మాణ కార్మిక సంఘం మొయినాబాద్ మండలాధ్యక్షుడు ప్రభుదాస్, నాగిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ సద్గుణచారి, కోశాధికారి అశోక్, శ్రీనివాస్, వెంకటయ్య, అర్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**తలకొండపల్లి** : ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు కానుగుల వెంకటయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. పెంటయ్య, పోచయ్య, పర్వతాలు, జంగయ్య, హమాలీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**యాచారం** : పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో పేదల ఉద్ధరణకు పాటుపడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.భాస్కర్ అన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా యాచారం మండల కేంద్రంలో సభ నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. భాస్కర్ మాట్లాడుతూ సీపీఎం కార్యకర్తలు నిరంతరం పేదల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం కోసం కృషి చేయాలన్నారు. సుందరయ్య ఆశయాలను నేడు ఎంతమంది పాలకులు కొనసాగిస్తున్నారన్నారు. కమ్యునిస్టులు ఏనాడు అధికారం కోసం పాకులాడలేదని, పేదల సమస్యలు పరిష్కరించి వారిని ఉన్నతిలోకి తేవడం కోసం సీపీఎం కృషి చేస్తుందని ఆయన అన్నారు. మండల కార్యదర్శి ఆలంపల్లి భాస్కర్, కె.జగన్, పి.బ్రహ్మయ్య, పి.అంజయ్య, వినోద్‌కుమార్, చందూనాయక్, థావ్‌నాయక్, మల్లేష్ తదితరులున్నారు.

**కందుకూరు** : పేదల సమస్యలను పాలకుల దృష్టికి తేవడంతో పాటు వాటిని పరిష్కరించడం కోసం నిరంతరం శ్రమించిన సుందరయ్య బాటలో యువత నడుచుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డి.రాంచందర్ చెప్పారు. ఆదివారం కందుకూరు మండల కేంద్రంలో వర్ధంతి సభలో మాట్లాడుతూ ప్రజలతో కలిసి ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం సుందరయ్య చేసిన కృషిని కొనియాడారు. అంతకు ముందు కందుకూరులో సుందరయ్య చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు థావ్‌నాయక్, మల్లేష్, ఆలంపల్ల జంగయ్య, పి.అంజయ్య తదితరులున్నారు.


షాద్‌నగర్ : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


యాచారం : వర్ధంతి సభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి భాస్కర్


ఇబ్రహీంపట్నం : సుందరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


మొయినాబాద్ రూరల్ : నాగిరెడ్డిగూడలో నివాళులర్పిస్తున్న నాయకులు


తలకొండపల్లి : పడకల్‌లో సుందరయ్య జయంతి వేడుకల్లో సీపీఎం నాయకులు


కందుకూరు : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం కార్యకర్తలు

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ టీచర్ దుర్మరణం


శ్రీరాములు(ఫైల్)

మంచాల, మే 19 : రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన మంచాల పోలీస్‌స్టేషన్ పరిధి రంగాపూర్ ఎక్స్‌రోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. యాచారం మండలం నల్లవెల్లికి చెందిన భట్టు శ్రీరాములు(40) ఇంజాపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సాంఘికశాస్త్రం బోధిస్తుంటాడు. ఆదివారం ఉదయం బైక్‌పై స్వగ్రామం నల్లవెల్లి నుంచి నల్లగొండ జిల్లా మర్రిగూడ గూడ మండలం కుదాన్‌పల్లిలోని బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో రంగాపూర్ ఎక్స్‌రోడ్డులో ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. తీవ్రగాయాలు కాగా.. శ్రీరాములు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం సివిల్ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవినాయక్ తెలిపారు.

### అక్రమంగా తరలిస్తున్న 25 ఆవు దూడలు స్వాధీనం

యాచారం, మే 19 : ఏపీలోని కాకినాడ జిల్లా తుని నుంచి హైదరాబాద్‌లోని జియగూడకు అక్రమంగా తరలిస్తున్న 25 ఆవుదూడలను శనివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై గోపాల్ తెలిపారు. బొలేరో వాహనంలో ఇస్రావు శ్రీను అనే వ్యక్తి వాటిని తరలిస్తున్నాడని తెలిపారు. యాచారం మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆవుదూడలను స్వాధీనం చేసుకుని గోశాలకు తరలించామని చెప్పారు.

## గ్రామీణ కళలకు జీవం పోయాలి


ప్రోత్సాహక నగదును అందజేస్తున్న కేశవ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, మే 19: అంతరించిపోతున్న గ్రామీణ కళలకు జీవం పోసి భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైన ఉందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాస్ రెడ్డి, తలకొండపల్లి పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డిలు అన్నారు. కళాకారులకు ప్రతీ ఒక్కరు చేయూతనందించి ప్రోత్సహించాలని కోరారు. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో శ్రీరేణుకా ఎల్లమ్మ జీవిత చరిత్ర బైలు నాటక ప్రదర్శన కళాకారులను ఆదివారం కాసు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. కళాకారులకు ప్రోత్సహకంగా రూ.10 వేలు ఆర్థిక సాయం సమకూర్చగా పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్, నరసింహ, రమేశ్, పోచయ్య, జంగయ్య, తదితరులు ఉన్నారు.

## ఘనంగా వెలాంకణ్ణి మాత క్షేత్రంలో ఉత్సవాలు


ప్రిన్సిపాల్ జాన్‌పాల్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

శంషాబాద్, మే 19 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఇన్‌ఫాంట్ జీసెస్ కళాశాల ఆవరణలో ఉన్న వెలాంకణ్ణి మాత క్షేత్రం సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. శంషాబాద్‌లో 25 సంవత్సరాల క్రితం ఇన్‌ఫాంట్ జీసస్ ఇంటర్‌నేషనల్ స్కూల్, కళాశాల నిర్మించి అదే ఆవరణలో వెలాంకణ్ణి మాత క్షేత్రం నిర్మించారు. ఆ పక్కనే వెలాంకణ్ణి కాలనీ ఏర్పాటైంది. కాలనీ చుట్టుపక్కల గల మేరీమాత భక్తులు ఈ పాఠశాల, కళాశాలల్లో విద్యాభ్యాసం చేసేవారు. వారితో పాటు కొందరు పేదలకు సైతం ఈ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యనందించేవారు. ఈమేరకు సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల, కళాశాలల్లో పనిచేసిన టీచర్లను క్షేత్రంలో విధులు నిర్వహించిన పాస్టర్లు, సిస్టర్లను కాలనీ అసోసియేషన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ జాన్ పాల్, ఆనంద్, భాస్కర్‌రెడ్డి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి


మెటీరియల్ అందజేస్తున్న జడ్పీటీసీ దశరథ్ నాయక్

కడ్తాల్, మే 19: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి వారి సొంతింటి కలను సాకారం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి స్టాండిగ్ కమిటీ సభ్యుడు, జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ కోరారు. ప్రభుత్వ పథకాల అమలులో రాజకీయాలకు, స్వార్థ చింతనకు చోటివ్వకూడదని కోరారు. మండలంలోని సాలార్‌పూర్ గ్రామంలో ఆదివారం దశరథ్ నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కర్రె సిలారి ఇంటి నిర్మాణానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 30 బస్తాల సిమెంట్‌ను సమకూర్చి దశరథ్ నాయక్ అందజేశారు. రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వానా కాలం పంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో పంట పెట్టుబడికి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకుముందు ప్రకటించిన విధంగా రైతుభరోసా కింద ఎకరాకు రూ.15వేల చొప్పున పెట్టుబడి సాయం అందించాలని దశరథ్‌నాయక్ కోరారు. పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను, పిడుగు పాట్లకు మృతిచెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలకు చోటులేకుండా సరఫరాలో అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని దశరథ్ నాయక్ కోరారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, కడ్తాల వైస్‌ఎంపీపీ ఆనంద్, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ముజుబుర్ రహెమాన్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు పాండు, కృష్ణ, శ్రీను, గోపాల్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## రిజర్వేషన్లతోనే బలహీన వర్గాలకు రాజ్యాధికారం

ఘట్‌కేసర్, మే 19: బాబాసాహెబ్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్ ప్రక్రియతోనే బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం లభిస్తున్నదని ఘణపూర్ మాజీ సర్పంచ్ నానావత్ రూప్‌సింగ్‌నాయక్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ చౌరస్తాలో ఆదివారం ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో స్వాతంత్ర్యానికి ముందు, అనంతరం అనేక సంవత్సరాల పాటు బడుగు, బలహీనవర్గాలకు సముచిత స్థానం ఉండేదికాదన్నారు. కానీ రాజ్యాంగహక్కుల కోసం ఉద్యమాలు చేయటంతో రిజర్వేషన్ల ప్రక్రియను అమలు చేయటం వల్ల బడుగు, బలహీనవర్గాలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సరైన గుర్తింపుతో పాటు పదవులు లభించాయన్నారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, దాసు, శ్రీనివాస్, సచిన్, అశోక్, రామ్‌దాస్, రాజేష్, ఆంజనేయులు, నర్సింగ్‌రావు, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నానావత్ శివాజీనాయక్, నర్సింహ పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల సమరానికి సమాయత్తం కావాలి


మైసమ్మ దేవతకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, మే 19 : స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి పిలుపునిచ్చారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కష్టపడి పనిచేసిన వారికి ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో, పార్టీ పరంగా సముచిత స్థానం కల్పిస్తామని వారు అన్నారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎంపీ మల్లు రవి, జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్‌లు సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కసిరెడ్డి నారాయణరెడ్డి మాధవి దంపతులు బోనంతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక ఎమ్మార్జీ గార్డెన్‌లో కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్యనేతలతో కసిరెడ్డి, మల్లు సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో రెండు నెలల పాటు కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పోలింగ్ తీరును పార్టీ నేతలతో సమీక్షించారు. అభివృద్ధి, ఆరు గ్యారంటీ పథకాల అమలును కాంక్షించి ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారన్నారు. రాష్ట్రంలో 12 నుంచి 14 పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో కాంగ్రెస్ ప్రభంజనం మొదలైందని, రాహుల్ నేతృత్వంలో 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభావం కోల్పోయిందని, ఆ పార్టీకి సగానికి పైగా స్థానాల్లో డిపాజిట్లు కూడా రావన్నారు. దేశంలో బీజేపీపై ప్రజా వ్యతిరేకతను గ్రహించిన ప్రధాని మోదీ అసహనంతో విద్వేషాలను రెచ్చగొట్టేలా సభల్లో మాట్లాడుతున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందని, గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలన్నారు. రైతుల రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల పంట రుణాలు మాఫీ చేయడం జరుగుతుందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపరిచి ఆదర్శంగా నిలుపుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు యాట నర్సింహ, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కమ్లీమోత్యానాయక్, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, అనితవిజయ్, వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, విజయ్‌కుమార్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, మోతిలాల్, శ్రీకాంత్‌రెడ్డి, బ్యాగి ఆనంద్ కుమార్, రమణారెడ్డి, భూపతి రెడ్డి, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, గట్ల కేశవ రెడ్డి, కాసు శ్రీనివాస్ రెడ్డి, హన్మనాయక్, చేగూరి వెంకటేశ్, జక్కు అనంతరెడ్డి, గూడూరు భాస్కర్ రెడ్డి, నిట్ట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తలకొండపల్లి, మే 19 : తలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993-94 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన సమ్మేళనంలో బాల్యమిత్రులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలు, హోదాలలో ఉన్న మిత్రులంతా కలుసుకొని ఒకరికి ఒకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతికి బాటలువేసిన ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు వేణు, రాము, శ్రీరాములు, ఆనంద్, రహీం, యాదగిరి, సత్యం, సునిత, సంధ్య తదితరులున్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న దశరథ్ నాయక్

కడ్తాల్/మాడ్గుల, మే 19 : మండల పరిధిలోని కోర్షకొండ తండాకు చెందిన సభావట్ సోమ్లు నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కడ్తాల జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ ఆదివారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని సందర్శించి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో మండల రైతు సమన్వయ సమితి కో-ఆర్డినేటర్ జోగు వీరయ్య, మాజీ సర్పంచ్‌లు గూడూరు లక్ష్మీ నర్సింహరెడ్డి, నక్కపోతు యాదయ్య, నాయకులు వినోద్, రాజు, శ్రీను, కృష్ణ, పాండు, బిక్కు, వెంకటయ్య, సోమ్లు తదితరులు ఉన్నారు. అదేవిధంగా మాడ్గుల మండలంలోని నల్లచెర్వు గ్రామానికి చెందిన ఊటు బుడ్డయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటుబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన రూ.3వేలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రెడ్డి కృష్ణారెడ్డి ద్వారా మృతుడి భార్య ఊటు పోచమ్మకు అందచేశారు. మాజీ ఉపసర్పంచ్ రాశిక మల్లయ్య, కట్ట యాదయ్య, భూతరాజు మహేష్, రాశిక రమేష్, వరికుప్పల రాజు, రామాంజలు పాల్గొన్నారు.


నగదు అందచేస్తున్న నాయకులు

## బీరప్ప ఆలయంలో వీర్లపల్లి శంకర్ పూజలు


చౌదరిగూడ : బీరప్ప ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, మే 19: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాల బీరప్ప దేవాలయంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పండగలు శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. మండలాధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి, నాయకులు వెంకట నర్సింహారెడ్డి, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, రవికుమార్, సురేందర్ గ్రామస్తులున్నారు.

## కులగణన చేపట్టాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

తాండూరు, మే 19: కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం తాండూరులో మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో సమగ్ర కులగణన చేపడుతామన్నారు. కులగణన చేయకుండా బీసీ రిజర్వేషన్లు పెంచకుండా సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు రాజకీయంగా నష్టపోతారని, అసెంబ్లీలో కులగణనపై తీర్మానం చేయడంతో పాటు జీవో-26ను విడుదల చేయడంతో రూ.150కోట్ల బడ్జెట్‌ను విడుదల చేసిన ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు వెళ్లడం సరైంది కాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా బీసీలు పోటీచేసే అవకాశం రావాలంటే జనాభా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహించాలన్నారు.

## సంక్షిప్తంగా..

**యాచారం** : జాతీయ పంచాయతీ ఆ వార్డు ఎంపిక కోసం మండలంలోని కుర్మిద్ద, నందివనపర్తి, యాచారం గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి జిల్లా అధికారులకు నివేదిక పంపారు. ఈమేరకు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**కందుకూరు** : మండలంలోని నేదునూరు గ్రామంలో నల్లోంబాయి భూమిలో కబ్జాకు గురైన నక్షబాటను చూపాలని ఆ గ్రామస్తులు, రైతులు ఆందోళన చేపట్టారు. నక్షబాట చూపి వివాదాన్ని పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. హద్దులు చూపేదాకా ఆందోళన విరమించేదిలేదని రైతులు తేల్చి చెప్పడంతో పరిస్థితి అదుపు తప్పింది. అధికారులు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నక్షబాటను సమగ్రంగా సర్వే చేసి రైతులకు ఉపయోగపడే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.

**కడ్తాల్** : అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయాన్ని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈఏడాది వర్షాలు సమృద్ధిగా పంటలు బాగా పండాలని, కల్వకుర్తి నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని సత్య దేవుడివ్రతం, కల్యాణం నిర్వహించినట్లు చెప్పారు.